# అవగాహన

అవధాని క్రియాశీల రాజకీయ వేత్తకాదు.

కానీ ఒకానొక రాజకీయపార్టీ సిద్ధాంతానికి భాష్యకారుడు. ఆ పార్టీ నాయకులు ఆయన్ని మహర్షిలా భావించి గౌరవించేవారు.

కాలక్రమాన రాజకీయ వేత్తలంతా ధనవంతులయ్యారు. వొక్కగా వొక్క కూతురు మలయవాసినికి వివాహం చేయటం కష్టమయినప్పుడు అవధాని పెంచుకొన్న సిద్ధాంత భ్రమలు తొలగి పోయాయి.

ఒకప్పుడు తండ్రి వాడిన కొన్ని పడికట్టు పదాలని మలయవాసిని చిలకలా నేర్చుకొంది. తండ్రి వాగ్ధాటి అబ్బింది. చిన్నపాయింటు వుంటే చాలు-సాలెగూడులా ఆ పాయింటు చుట్టూ పెద్దగూడు అల్లి ప్రత్యర్థిని యిడలించి వేస్తుంది. అవధాని ఆమె ధోరణిని మార్చాలని ప్రయత్నించాడు కానీ సాధ్యంకాలేదు. తండ్రిలాగా తానూ గొప్ప మేధావినని ఆమె గర్వం!

అలాంటి స్థితిలో రామ్‌మోహనరాయ్ మలయవాసిని ప్రేమించి పెళ్లి చేసుకోటానికి సిద్ధమయ్యాడు.

రాయ్‌ది ఆవూరే. ధనవంతుడు. అతని తండ్రిని అవధాని విమర్శించేవాడు. మలయవాసినికికూడా ఐశ్వర్యంవున్న ఆకుటుంబం అంటే మంట.

అంచేత మలయవాసిని అతను పెళ్ళి చేసుకొంటాననగానే ఎగిరి గంతేసి అతని వొళ్ళో వాలిపోలేదు.

"అసలు యీ వివాహ వ్యవస్థను గురించి మీ అభిప్రాయం ఏమిటి ?"

రాయ్ రాజకీయాలు మాట్లాడడు. భావుకుడు. సంస్కరణాభిలాషి. పుస్తక పఠనం అతనికున్న గొప్పహాబీ.

మలయవాసిని ప్రశ్నవిని అతను చిరునవ్వు నవ్వేడు. సమాధానం యివ్వలేదు. మలయవాసిని అతనిమీద దండయాత్ర చేసింది.

యీ బూర్జువా వివాహ వ్యవస్థ నిజానికి సమిష్టి పెండ్లాల వ్యవస్థ. బహిరంగ వేశ్యావృత్తి. ప్రచ్ఛన్న వేశ్యావృత్తి. యీ సమిష్టి పెండ్లాలవ్యవస్థలో అంతర్భాగాలు. మీకు తెలీదేమో. బూర్జువాకు తన భార్య కేవలం వుత్పత్తి సాధనంగా మాత్రమే కన్పిస్తుంది. ప్రస్తుత వుత్పత్తి వ్యవస్థ సమూలంగా పెకలింపబడ్తే తప్ప యీ స్థితిలో మార్పురాదు. స్త్రీకి సరైన గౌరవ ప్రపత్తులు, సామాజిక న్యాయం, భద్రత చేకూరదు. ఏమంటారు ?"

అనవసర వాగ్యుద్ధాలంటే యిష్టలేని రాయ్ ఏమీ అనలేదు. అతని మౌనం అతని బలహీనతగా, అజ్ఞానంగా భావించి మలయవాసిని మరో అస్త్రాన్ని విసిరింది.

"అందుకే శాస్త్రీయ అవగాహన అవసరం అని నేను మొత్తుకొనేది. డబ్బు, డిగ్రీలు వున్నంతమాత్రాన శాస్త్రీయ అవగాహన అలవడదు"

"అదేదో అవగాహన లేకపోతే పెళ్ళి చేసుకోకూడగా? యిదెక్కడి ధర్మశాస్త్రం ?" రాయ్ మెల్లగా అన్నాడు.

పందొమ్మిది వందల డెబ్భైఏడు ఎన్నికల ఫలితాలు ప్రకటన అవుతున్నప్పటి ఇందిరాగాంధీ అయ్యింది మలయవాసిని పోషణం ! ఆ తర్వాత మరింత తారస్థాయిలో తీవ్రంగా అంది.

"శాస్త్రీయ అవగాహన లేనంతకాలం పురుషుడు భార్యను బానిసలా చూస్తాడు. స్త్రీకి సంఘంలో గౌరవ ప్రపత్తు లుండవు"

"నేను నా భార్యను బానిసలా, ఉత్పత్తి సాధనంలా చూడను. సాటి మనిషిలా—చేతనామూర్తిలా చూస్తాను"

"పెళ్ళి కాకముందు ప్రతి మగాడూ చెప్పే కబుర్లేయివి. సమాన హక్కులిస్తారా స్త్రీకి ?"

"యిస్తాను, కానీ హక్కులన్న ఆలోచన కూడా బూర్జువా నా సృష్టే ననుకొంటాను ?"

నివ్వెరపోయిందతని ప్రశ్నకు !

"అందుకని హక్కులన్నీ మీ గుప్పెట్లో పెట్టుకొని స్త్రీని అణగ దొక్కుతారా ? పతివ్రతా ధర్మాలు చెప్పి నిర్వీర్యురాలిని చేస్తారా ?"

"నా భార్యను నేను గౌరవిస్తాను"

"అ—కన్పడుతూనేవుంది. మీరు మీ భార్యను ఎంత గౌరవించేది ? యింతసేపు యిన్నిమాటలు మాట్లాడేరు ? ఒక్కసారి "ఏమండీ" అని నన్ను సంభోధించారా ? "మీరు" అని మన్ననచేసేరా ? మీరే తెలివిగల వాళ్ళ మనుకోకండి"

"క్షమించండి. అలాంటి పొరపాటు జరిగితే వుద్దేశ్యపూర్వకంగా జరిగిందికాదు. యికనుంచి అలాగే పిలుస్తానండీ. యిలాంటి కండిషన్లు యింకా ఏమన్నావుంటే...."

"నాకు సంపూర్ణ స్వేచ్ఛ వుండాలి"

"అది జన్మహక్కు. కాదనను"

"నా హక్కులకు భంగం కలిగినా, మీవల్ల అమర్యాద జరిగినా, విడాకులిచ్చే హక్కు నాకుండాలి—"

యింకా యిలాంటి కండిషన్లు చాలా పెట్టింది మలయవాసిని. అన్నింటికీ అంగీకరించాడు రాయ్. మలయవాసిని మొగుడయ్యాడు !

* * *

పెళ్ళి కాగానే మలయవాసినిని తన యింటికి తీసుకెళ్ళాననలేదు రాయ్. నాలుగురోజులు చూచి మలయవాసినే అడిగింది.

"నాకూ తీసుకెళ్దామనే వుందండీ. కానీ అలాగంటే సంప్రదాయ విరుద్ధమైన మీరేమంటారోననీ...."

"నేననేదేమిటి ?"

"మీ యింటికి నేనెందుకు రావాలి ? అది పాతపద్ధతి. మీరే మా యింటికి రావచ్చు ?- అవి మీరడగవచ్చుగా ?"

అడగొచ్చు. అది పాయింటే ? కానీ మలయవాసిని అడగలేదు.

అత్తగారింటికి వెళ్ళిన వారం తిరగకుండానే ఆమెతో సిద్ధాంత పరమైన విభేదాలొచ్చాయి.

అత్తగారిది బొత్తిగా ఛాందసం. ఆధ్యాత్మిక దృక్పథం. కొడుకు కోడల్ని "ఏమండీ"అని పిలవటం కర్ణకఠోరంగా, అశాస్త్రీయంగా విన్పించిందామెకు.

"పేరులో, పిలుపులో ఏముందిలేమ్మా ? పీ కోడలు సర్దాపడుతోంది. స్వల్పకోరిక. తీరిస్తే ఆమె సంతోషిస్తుందిగా ? తగాదాఎందుకు ?"

కొడుకుతో కాదనుకొని కోడలికే చెప్పి చూసింది.

"మీరు బూర్జువా వ్యవస్థలో పుట్టి పెరిగేరండీ. నేను శోషలిస్టు వ్యవస్థ సాధనకు అంకితమైన వ్యక్తిని. దృక్పథాల్లో తేడా తప్పదుమరి!"

యీ వొక్క విషయంలోనేకాదు. యిలాంటి చాలా విషయాల్లో అత్తా కోడళ్ళ మధ్య స్పర్ధ తప్పలేదు.

"నువ్వన్నట్లు కోడలు పాపం వ్యక్తిగతంగా మంచిదేరా. అయితే ఆమె సిద్ధాంతాల్లోనే ఎక్కడో పెద్ద లోపం వున్నట్లు వుంది. లేకపోతే ఆమె అర్ధం చేసుకోటంలో లోపమో ? ఏమైనా నేను మీ మధ్య స్పర్ధలకు కారణం కాకూడదుగా? కొన్నిరోజులు దేశంమీద సొస్తాను. ఏర్పాటుచెయ్యి."

మాన్కో అంత కొంపలో వొంటరిగా ఆత్మీయతా భావనలు లేకుండా నెలరోజులు గడిపేసరికి మలయవాసినికి బోర్ కొట్టింది. ఏకాంతాన్ని భరించలేక పోయింది. ఒక పోర్షను అద్దెకిస్తే ?

"ఎందుకండీ. యింట్లోయిల్లు అద్దెకిచ్చుకోవాల్సిన ఆర్థిక అవసరం మనకుందంటారా ? లేదని నా అభిప్రాయం. ఆ తర్వాత మీ యిష్టం. మీ యిష్టాన్ని నేను కాదను."

పెళ్ళయిన తర్వాత మొదటిసారిగా భర్త తన మాట కాదంటే బాగుండుననిపించింది మలయవాసినికి. అయినా యిదెక్కడి భర్త ? అన్నీ తన యిష్ట మంటాడేం ? యిదెక్కడి మంచితనం ?

ఆమెకు భర్త పైన చిరాకు వేసింది. చిత్రం ! క్షణంలో ఆ చిరాకు సిద్ధాంతరూపం దాల్చింది !

"యిల్లు అద్దెకివ్వాల్సింది మనకు ఆర్థిక అవసరం వుంటేనేకాదండీ. అది బూర్జువాదృక్పథం. అవతల వారి అవసరాన్ని ఆలోచించటం సామాజికస్పృహ-సోషలిష్టు దృక్పథం !"

అలా భర్త మీద విజయం సాధించింది. కానీ తీరా అద్దెకివ్వవచ్చేసరికి గీచిగీచి బేరమాడింది. అవతలవాడు మధ్యతరగతి వుద్యోగి అన్న దయ అన్నా లేకుండా ఆకాశాన్నంటే అద్దె అడిగింది.

"మధ్యతరగతి బూర్జువాల పట్ల దయ ఏమిటండీ ? సోషలిష్టు అవగాహన వున్నవాడు ఎవడూ ఆపని చేయడు. కార్మిక పక్షపాతం చూపాలి."

"పోనీ కార్మికులకే అద్దెకిస్తే బాగుండేదిగా ?" అలా అందామనిపించినా రాయ్ అనలేదు. ఆమె అప్పుడనబోయే మాటేమిటో అతనికి తెల్సు."

మీకు చారిత్రక అవగాహన బొత్తిగా లేదండీ.

ఆ బ్రహ్మాస్త్రానికి తిరుగులేదు మరి !

* * *

పక్కవాటాలో చేరిన నూతన జంట మాట్లాడుకొనే మాటలు మలయవాసిని చెవిలో పడ్తూనే వుండేవి. మొదట్లో బూర్జువా సెంటిమెంట్లు, బూర్జువా సర్దాలు అనుకొని చిరాకు పడింది. అయితే వినగా వినగా వాళ్ళ మాటల్లోగల అనురాగం, ఆత్మీయత ఆమె గుండెల్ని తాకసాగాయి. ఏదో లోటు ఫీలవసాగింది మలయవాసిని !

"యివాళ డ్యాన్సు ప్రోగ్రాం వుందిటండి. నాకు వెళ్దామని వుంది. మీకూ అంగీకారమవుతే రెండు టిక్కెట్లు కొనుక్కొస్తాను. ఏమంటారు ?" వోరోజు రాయ్ అన్నాడు.

భర్త కొత్తలో యిలా ప్రతిదానికీ అడుగుతుంటే, మర్యాదనిచ్చి మన్నన చేస్తుంటే ఏదో గర్వం ! థ్రిల్ !

కానీ యివాళ ఆ అనుభూతి కలగటంలేదేం ? అతని మంచితనం, మర్యాద, మొహం మొత్తుతున్నదేం ?

"ప్రతిదానికీ నా అనుమతి కావాలా? మీరు టిక్కెట్లు కొనుక్కొచ్చి డ్యాన్సుకు రమ్మంటే రానా నేను ?" మొగుడు మీదికి ధ్వజమెత్తింది.

"అలాగనికాదు. నా అభిరుచిని మీ నెత్తిన రుద్దటం నిరంకుశత్వం కాదూ ? మీ వ్యక్తిత్వానికి విలువనివ్వడం నా ధర్మం కదాండి ? ఏమంటారు ?"

మలయవాసిని కొత్తజంట సంభాషణల్లో ఆత్మీయత గుర్తు కొచ్చింది. ఏకవచనంలోనే పిల్చుకొంటారు వాళ్ళు. ఎంత ఆప్యాయత !

ఆమెకు ఉక్రోషం వచ్చింది. అందులో మంచి బాధ—ఏడుపు !

ముందు యికనుంచి యీ "అండీ"లు గుండీలు మానేయండి. ఏం? పెద్ద—మగవారు ! భార్యను "అండీ" అని "మీరు మీరని" పిలవటానికి సిగ్గేయటం లేదూ ?"

అదేమిటండీ ? కొత్తగా మాట్లాడుతున్నారే యివాళ?

"పక్కవాటాలో శారదను ఆమె భర్త ఎలా పిలుస్తాడో విన్నారా? ఏం? నాకా ఆప్యాయత, అనురాగం అక్కర్లేదనుకొన్నారా? యికనుంచి పరాయిదాన్ని పిల్చినట్లు పిలిస్తే వూరుకోను. తెల్సిందా?" శాసనం అది.

"అలాగే పిలుస్తాను. కానీ అప్పుడు మీరు నన్ను కూడా "ఒరేయ్-ఏమిట్రా" అని పిలవాల్సివుంటుంది. పెళ్ళికి ముందు మీకిచ్చిన మాటను మర్చిపోలేదండీ నేను. మాటతప్పే మనిషిని కాను నేను."

* * *

భర్తచేత "అండీ" మాన్పించటానికి మలయవాసిని ఎన్నో ప్రయత్నాలు చేసింది. కోపాలు—అలకలు—పోట్లాటలు—నిష్ఠూరాలు—ఆమె ఎన్ని చేసినా అతను తన పద్ధతి మార్చలేదు. తన శాంతంతో, మంచితనంతో ఆమెను జయిస్తూనేవచ్చాడు.

"ఛీ ఆడదానితో-అందులోనూ తాళికట్టిన భార్యతో పోట్లాడడం కూడా చాతకాని వాడిని పెళ్ళిచేసుకోటం నాదే పొరపాటు."

"పెళ్ళాంతో పోట్లాడటం ఏం గొప్పండీ? యింకా శ్రామిక పక్షపాతంతో వారి హక్కుల కోసం బూర్జువా వర్గాల వారితో పోరాడినా ఫలంగానీ."

"ఆ-! ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికెక్కుతుందా. అని-భార్యా పక్షపాతం లేదు-ఆడదానితో పోట్లాడలేరు. యిక మీరేం విప్లవాలు నడిపిస్తారు?"

భర్త గౌరవించే కొద్ది మలయవాసినికి కలవరం పెరిగింది. అతను లొంగిపోయేకొద్దీ ఆమెకు, అతను తిరగబడి తనని తన్నాలన్న కోరిక పెరిగిపోయింది. మానసికంగా మార్పు రాసాగింది.

ప్రయత్నించి వాగ్దాటిని తగ్గించుకొంది. ఎంగిలి ముక్కల వాడకాన్ని విసర్జించింది. కొత్తగా ఆలోచించింది. కొత్త పాఠాలు నేర్చుకొంది:

"ఏమండీ. నాదో చిన్న అభ్యర్థన" రాత్రివేళ, రాగోదయ సమయాన, భర్త చెంతచేరి లాలనగా అంది మలయవాసిని.

"అభ్యర్థన ఏమిటి ? హక్కు. చెప్పండి" అంటాడని ఆమెకు తెల్సు. అంచేత అతనికాఅవకాశం యివ్వలేదు !

కొత్త భార్య సాక్షాత్కార మయినట్లుంది రాయ్‌కి !

"సంప్రదాయ జీవన సరళిలో మనిషియొక్క శారీరక మానసిక ధర్మాలు యిమిడి వున్నాయని అవగాహన చేసుకొన్నానండీ. మీ మంచి తనంతో నన్నింకా చిత్రవధ చేయకండి. పెళ్ళికి ముందు ఇంటర్వ్యూ, నేను పెట్టిన కండిషన్లు మర్చిపోండి. ప్లీజ్. మీ భార్యగా నాకు సంపూర్ణ అనురాగాన్ని, ఆత్మీయతని ప్రసాదించండి—"

మలయ మారుతీ యంత చల్లగా వున్నాయి ఆమె మాటలు. భార్యను దగ్గరికి తీసుకొన్నాడు రాయ్.

"స్వభావసిద్ధంగా నువ్వు మంచిదానివి మలయం. అయితే నీ ఆలోచన కొద్దిగా వక్రించింది. ఎక్కడో చెప్పుకో చూద్దాం."

"శాస్త్రీయ అవగాహన పేరిట మనిషి మనోధర్మాన్ని విస్మరించటమా ? హక్కులు పేరిట స్పర్థను చేజేతులా సృష్టించుకోటమా ?"

"అజ్ఞానం బలసిన రోజుల్లో పూర్వం, భారతీయ ధర్మశాస్త్రాలలోని కొన్ని ముక్కలు మాత్రమే నేర్చుకొని, తాము సకలశాస్త్రవేత్తలమైనట్లు మనుష్యుల్లో మూఢత్వాన్ని నూరిపోసేరు కొందరు. యిప్పుడు-విదేశీయమైన వో సిద్ధాంతంలోని కొన్ని ఎంగిలి ముక్కల్ని ఏరుకొని శాస్త్రీయ దృక్పథం అంటూ కొత్త మూఢత్వాన్ని ఇంజెక్షన్ చేయటానికి ప్రయత్నిస్తున్నారు మరికొందరు. మీ నాన్న నుంచి నేర్చుకొన్న అలాంటి ఎంగిలి ముక్కలే నీ బుద్ధి వక్రం కావటానికి కారణం. ఏ సిద్ధాంతమైనా ఆ దేశ మౌలిక సంస్కృతీ సంప్రదాయాలకూ, విశ్వాసాలకూ అనుగుణంగా

వుండాలి. అలా కాకపోతే స్పర్థ తప్ప జీవితంలో సంయమనం సమకూరదు. శాంతి, ప్రగతి వుండదు."

"ఏమీ తెలియని అమాయకుల్లా నటించారన్నమాట ! అబ్బో - మీకు చాలా తెల్సే ?"

"ఏమీ తెలియకుండా నిన్ను పెళ్ళి చేసుకొనే సాహసాన్ని చేస్తానా ?"

"అయినా నా మొండి ధోరణిని యిన్నాళ్ళు ఎలా సహించారండీ ?"

"ప్రేమతో, సహనంతో జయించలేనిదేముంది మలయం ? ప్రేమించి చేసుకొన్న భార్యను సంస్కరించుకోలేనివాడు, సంఘాన్ని, దేశాన్ని ఏం సంస్కరించ గలుగుతాడు ?"

"నేను చాలా అదృష్టవంతురాలినండీ."

మలయానిలంలా మెల్లగా చల్లగా అందామె !

(ఆంధ్ర పత్రిక 12-9-1980)

